క్లుప్తంగా

మునగపాకలో వీధి దీపాల ఏర్పాటు



వీధి దీపాల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: మునగపాక మెయిన్ రోడ్డులో వీధి దీపాల ఏర్పాటు పనులను బుధవారం సర్పంచ్ దిమ్మల అప్పారావు పరిశీలించారు. మెయిన్ రోడ్డులో గత కొద్ది రోజులుగా హైమాస్ట్ లైట్లు పాడైపోయాయి. దీంతో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు పంచాయతీ ద్వారా వీధి దీపాల ఏర్పాటు పనులు చేపట్టారు. దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అప్పారావు తెలిపారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు తప్పనిసరి



బాణసంచా దుకాణదారులతో మాట్లాడుతున్న సీఐ గణేశ్

అచ్యుతాపురం: బాణసంచా విక్రయదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అచ్యుతాపురం సీఐ గణేశ్ సూచించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను ఆయన బుధవారం పరిశీలించారు. యజమానులు భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

టెన్త్ విద్యార్థులకు గణిత దీప్తి పుస్తకాల పంపిణీ



విద్యార్థికి గణిత దీప్తి పుస్తకాలు అందజేస్తున్న వాడ్రాపల్లి హైస్కూల్ హెచ్ఎం సతీష్

మునగపాక: విద్యార్థులు ఇష్టపడి కష్టపడి చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం సతీష్ కోరారు. వాడ్రాపల్లి హైస్కూల్ గణిత ఉపాధ్యాయురాలు పద్మావతి తన సొంత నిధులతో సమకూర్చిన గణిత దీప్తి పుస్తకాలను పదో తరగతి విద్యార్థులకు హెచ్ఎం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిలో మంచి మార్కులు సాధించాలన్నారు. ప్రధానంగా గణితంపై పట్టు సాధించేందుకు ఇటువంటి గణిత దీప్తి పుస్తకాలు దోహదపడతాయన్నారు.

పాములవాకలో జంగిల్ క్లియరెన్స్



పాములవాకలో జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు

కోటవురట్ల: రోడ్డు ప్రమాదాల నివారణకు మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు చర్యలు తీసుకున్నారు. పాములవాక, శివారు గ్రామాల్లోని రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనదారులు పలుమార్లు మొరపెట్టుకున్నా ఆర్అండ్‌బీ శాఖాధికారులు స్పందించలేదు. దీంతో మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు ముందుకొచ్చారు. ట్రాక్టర్‌తో తుప్పల తొలగింపు చేపట్టడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

యలమంచిలి రూరల్: అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ సావిత్రి బుధవారం రాత్రి తెలిపారు. పట్టణంలోని ధర్మవరం సీపీపేట వీధికి చెందిన కణితి వెంకట్రావు అక్రమంగా బాణసంచా విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు తనిఖీ చేశారు. అతని వద్ద రూ.9,985 విలువ చేసే బాణసంచా సామగ్రి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

దారులు.. దారుణం.!

- అధ్వాన రోడ్లతో వాహన చోదకుల అవస్థలు
- ప్రతిపక్షంలో ఉండగా కూటమి నాయకుల హడావుడి
- ఇప్పుడు మౌనం వహించడంపై ప్రజల అసంతృప్తి



అధ్వానంగా ఉన్న అన్నవరం రహదారి



రామన్నపాలెం శివారు రహదారిలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

కోటవురట్ల: అధ్వాన రహదారులతో వాహనచోదకులు బేజారెత్తుతున్నారు. అడుగుకో గొయ్యి వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. చిన్న చినుకు పడితే చాలు విశ్వరూపం చూపిస్తున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా దారుణంగా ఉన్న రహదారులే దర్శమిస్తున్నాయి. అడుగడుగునా గోతులతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో మరిన్ని కష్టాలు తప్పడంలేదు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జనసేన, టీడీపీ నాయకులు గోతుల వద్ద సెల్ఫీలు తీసుకుని ఇదీ ఏపీలో రోడ్ల పరిస్థితి అంటూ అతి చేశారు. ఈ రహదారుల్లో ఒక్కరోజు కూడా ప్రయాణం చేయలేమని, వెంటనే అభివృద్ధి చేయాల్సిందే అన్నారు. మా కూటమి ప్రభుత్వం వస్తే వెంటనే రహదారులను అభివృద్ధి చేసేస్తామని తెగ హామీలు కూడా ఇచ్చేశారు. ఇంకేముంది కూటమి ప్రభుత్వం రాగానే రహదారులు అద్దంలా మెరిసిపోతాయని అంతా అనుకున్నారు. ప్రభుత్వం వచ్చి 5 నెలలు కావస్తున్నా రహదారుల అభివృద్ధి ఊసే వినిపించడం లేదు. గ్రామీణ రహదారుల గోడు ఎవరికీ పట్టలేదన్న విమర్శలు వస్తున్నాయి. గతంలో నానా హడావుడితో అతి చేసిన కూటమి నాయకులు నోరుమెదపడంలేదు. పాయకరావుపేట నియోజకవర్గంలోని ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల మండలాలలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కోటవురట్ల మండలంలో అన్నవరం, రామన్నపాలెం, రాజుపేట, రామచంద్రపురం-దార్లపూడి రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. పలువురు వాహనదారులు ఈ రహదారుల్లో ప్రమాదాలకు గురవుతున్నారు.

గత ప్రభుత్వంలో రూ.13 కోట్లతో రహదారుల అభివృద్ధి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక్క కోటవురట్ల మండలంలోనే సుమారు రూ.13 కోట్లతో రహదారులను అభివృద్ధి చేశారు. పెదబొడ్డేపల్లి నుంచి రామచంద్రపురం వరకు రూ.7.50 కోట్లు, జల్లూరు జంక్షన్ నుంచి బి.కె.పల్లి వరకు రూ.1.20 కోట్లు, బి.కె.పల్లి నుంచి రామచంద్రపురం వరకు రూ.కోటి, అల్లుమియ్యపాలెం రహదారికి రూ.3 కోట్లుతో తారు రోడ్లు, అణుకు గిరిజన గ్రామానికి రూ.50 లక్షలతో గ్రావెల్ రోడ్డు వేసి అభివృద్ధి చేశారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు..



రామచంద్రపురం జంక్షన్ నుంచి ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు వరకు రహదారి అధ్వానంగా ఉంది. నర్సీపట్నం-అడ్డురోడ్డుకు ఇది ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోడ్డు దారుణంగా ఉండడంతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ఈ రహదారిని అభివృద్ధి చేయాలి. – ఆర్.ఎస్.సత్యనారాయణరాజు, మాజీ వైస్ ఎంపీపీ, తంగేడు

రోడ్ల అభివృద్ధి ఎప్పుడో?



కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు కావస్తోంది. ఇంకా ఒక అభివృద్ధి పని చేయలేదు. కనీసం రోడ్లు అయినా అభివృద్ధి చేస్తారనుకున్నాం. ప్రతిపక్షంలో ఉండగా కూటమి నాయకులు నానా హడావుడి చేసేవాళ్లు. ఇప్పుడు దారుణంగా ఉన్న రహదారుల కారణంగా చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు. ఒక్క నాయకుడు కూడా రోడ్లు గురించి నోరు మెదపడంలేదు.

– లోకారపు బాబులు, పి.కె.పల్లి

పొటాష్‌తో వరిలో తాలు గింజల నివారణ



బి.కె.పల్లిలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు



వరి పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న పాయకరావుపేట వ్యవసాయ శాఖాధికారులు

కోటవురట్ల: వరి పొట్ట దశకు చేరుకుంటున్న సమయంలో పొటాష్ ఎరువును వేయడం వల్ల తాలు గింజలు తగ్గి దిగుబడి పెరుగుతుందని పాయకరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.ఉమా ప్రసాద్ సూచించారు. బి.కె.పల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వరిలో ఎరువుల వినియోగం, తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు మందులు సూచించారు. ఏడీ మాట్లాడుతూ అక్కడక్కడా వరిలో ఆకుముడత, పాముపొడ తెగుళ్ల కనిపిస్తున్నాయని, వాటి నివారణకు వ్యవసాయాధికారుల సూచనతో మందు స్ప్రే చేయాలన్నారు. ఏవో సరోజిని మాట్లాడుతూ దుబ్బు మొదలన దోమ చేరి ఉంటుందని, రైతులు ఎప్పటికప్పుడు పరిశీలన చేసి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి మినుములు, పెసర విత్తనాలు మండల కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని సాధించాలని కేవీఆర్ హరిపురం శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని మంగవరం, గోపాలపట్నం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి, కొబ్బరి, అరటి, పామాయిల్ తదితర పంటలకు ఉపయోగించాల్సిన ఎరువులు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఏవో పి.ఆదినారాయణ, నీటి పారుదల శాఖ ఏఈ శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: పూత దశలో ఉండే వరి పంటలో క్రిమి సంహారక మందులు పగటి పూట 12 గంటల తరువాత వేయాలని యలమంచిలి వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ప్రభాకర్ తెలిపారు. సైతారుపేట గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పొలాల్లో క్షేత్ర పరిశీలన చేసి పంటకు ప్రస్తుతం ఆశించే చీడపీడలపై అవగాహన కల్పించారు. ఆకుముడత, సుడిదోమ, పొటాష్ లోపాల నివారణకు మందులు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మరో శాస్త్రవేత్త కుమారి, మండల వ్యవసాయాధికారి సౌజన్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



వెంకటాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మునగపాక: ప్రతి ఒక్కరూ హక్కుల గురించి తెలుసుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆది మహేశ్వరరావు కోరారు. మండలంలోని వెంకటాపురం దళితవాడ లో బుధవారం మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదిమహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగా లన్నారు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా గ్రామ స్వరాజ్యం కోసం కృషి చేయాలన్నారు. సర్పంచ్ సుందరపు తాతాజీ, మాజీ సర్పంచ్ కనక ప్పారావు, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, కడియం అనురాధ, మాలతి, బాబూరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మునగపాక: తోటాడ శ్మశానవాటికలో చేపట్టిన అభివృద్ధి పనులను సర్పంచ్ దొడ్డి మంగవేణి సూచన మేరకు వైఎస్సార్‌సీపీ నాయకుడు దొడ్డి కోటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానవాటికను అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము, స్థానిక నాయకులు దొడ్డి రమేష్, పాలమరౌట్టి మురళి పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల విజయం



ఎన్నికైన కైలాసపట్నం ఎంపీపీ స్కూల్ ఎస్ఎంసీ కమిటీ సభ్యులు

కోటవురట్ల: కైలాసపట్నంలోని ఎంపీపీ స్కూల్‌లో ఎస్ఎంసీ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. గతంలో ఎన్నికల ప్రక్రియలో వివాదం నెలకొనడంతో వాయిదా వేయగా.. తాజాగా నిర్వహించిన ఎన్నికలలో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. వాస్తవానికి గతంలో నిర్వహించిన ఎన్నికలలో కూడా వైఎస్సార్ సీపీ మద్దతుదారులే విజయం సాధించగా, అడ్డగోలుగా తమ మద్దతుదారులతో కమిటీ వేయాలని టీడీపీ నాయకులు ప్రయత్నించి వివాదం సృష్టించి ఎన్నికలు వాయిదా అయ్యేలా చేశారు. ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎస్.మంగ, వైస్ చైర్మన్‌గా టి.కుమారి, పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులను మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెన్నాడ రాంబాబు, చామంతుల శ్రీనివాసరావు, ఎస్.సురేష్, ఎం.రమణ, ఎం.శివ, టి.వరహాలబాబు, మాజీ ఉప సర్పంచ్ డీవీ రావు అభినందించారు.

రీసర్వేలో లోపాల సవరణకు అవకాశం



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: రీసర్వేలో లోపాలను సవరించేందుకు రెవెన్యూ సదస్సులు అందుబాటులోకి తీసుకువచ్చామని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. మండలంలోని వెంకటాపురంలో బుధ వారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారంతో పాటు గతంలో నిర్వహించిన రీ-సర్వేలో జరిగిన లోపాలను సవరించేందుకు ఇటువంటి వేదికలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. సర్పంచ్ సుందరపు తాతాజీ, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, ఉప సర్పంచ్ బొమిరెడ్డిపల్లి సాయివజ్రం, రీ-సర్వే డీటీ పడాల్, ఆర్ఐ కిషోర్‌కుమార్, మాజీ సర్పంచ్ సుందరపు కనకప్పారావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంచరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



నాగేంద్ర కాలనీలో కొలువుదీరిన స్వామి

యలమంచిలి రూరల్: పట్టణంలో నాగేంద్ర కాలనీలో కొలువైన నాగేంద్రస్వామి ఆలయం వద్ద గురువారం నుంచి పంచరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గత 40 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఉత్సవాలను ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఐదు రోజులూ ఒక్కో విశేష కార్యక్రమాలతో భక్తిశ్రద్ధలతో ఉత్సవాల నిర్వహణ చేపడుతున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు సిరసపల్లి రమణ, సాంబశివరావు, సిరసపల్లి గోవింద్, అల్లెపు సత్య గుప్తా, పాముల నాగేశ్వరరావు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ పరిసరాల్లో విద్యుత్ దీపాలతో అలంకరించారు.

వివాదాస్పదంగా హైస్కూల్ ప్రహరీ నిర్మాణం



తొలగించిన జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ నిర్మాణ పనులు వివాదాస్పదంగా మారాయి. హైస్కూల్ అభివృద్ధిలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో ప్రహరీ నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో హైస్కూల్ పక్కనే ఉన్న చెరువు చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు నిర్ణయించారు. ఇక్కడ ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం బాగున్న ప్రహరీని కూల్చివేసి పనులు ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధిలో భాగంగా వచ్చిన నిధులను ఇతర అవసరాలకు వినియోగించకుండా బాగున్న ప్రహరీని తొలగించడం సమంజసం కాదని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ సూచించారు. ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

15 బాణసంచా దుకాణాల ఏర్పాటు



అడ్డురోడ్డులో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణం

ఎస్.రాయవరం: మండలంలో 15 బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఇచ్చారు. అడ్డురోడ్డు వాణిజ్య కేంద్రంలో 9 షాపులు, ఎస్.రాయవరంలో 2, పి.ధర్మవరంలో 2, పెదగుమ్ములూరులో ఒకటి, దార్లపూడిలో ఒకటి చొప్పున బాణసంచా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిబంధనలు ప్రకారం షాపులు ఏర్పాటు చేశారని ఎస్ఐ విభీషణరావు తెలిపారు. మరోవైపు బాణసంచా ధరలు అధికంగా ఉండడంతో మొదటిరోజు విక్రయాలు మందకొడిగా సాగాయి.



నక్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల సమక్షంలో బుధవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. – నక్కపల్లి

సాగులో మెలకువలు తప్పనిసరి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి గోవింద్

అచ్యుతాపురం: వ్యవసాయ సాగులో మెలకువలను రైతులు తప్పనిసరిగా పాటించాలని అచ్యుతాపురం మండల వ్యవసాయాధికారి గోవింద్ అన్నారు. అచ్యుతాపురం మండలంలోని దొప్పెర్లలో నిర్వహించి న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎరువుల వినియోగం, బిందు సేద్యం, విత్తనాల లభ్యత గురించి వివరించారు. ప్రభుత్వ పథకాల అర్హత, వర్తింపు వంటి అంశాలపై రైతులకు అవగాహన అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వో సాయి ప్రియ, ఎంఏవో రంజిత, పల్లె శేషగిరిరావు, కొల్లి వరహాలరావు, కొల్లి సురేశ్, కొల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: ప్రతి నెలా ఒకటో తేదీన అందించే సామాజిక పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. బుధవారం కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకటో తేదీన లబ్ధిదారులందరికీ స్వయంగా పింఛన్లు అందజేయాలన్నారు. ఎవరైనా మిగిలిపోతే మరుసటి రోజు పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం లాలం కోడూరు ఫీడర్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. లాలం కోడూరు, అప్పన్నపాలెం, రాజకోడూరు, లోవపాలెం, కృష్ణంపాలెం, వెంకయ్యపాలెం, గొరపూడి, వెల్చూరు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సామాజిక సేవకు 'మైహోమ్' ప్రాధాన్యం



వీహెచ్ చౌదరి

యలమంచిలి రూరల్: కర్మాగారం ఆవిర్భావం నుంచి మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సామాజిక సేవకు అధిక ప్రాధాన్యతనిస్తోందని కర్మాగారం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వీహెచ్ చౌదరి అన్నారు. బుధవారం యలమంచిలి మండలం ములకలాపల్లి మైహోమ్ సిమెంటు కర్మాగారంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ సంస్థ ప్రజల పట్ల ఎంతో సామాజిక దృక్పథంతో వ్యవహరిస్తుందన్నారు. ఇటీవల అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తమ యాజమాన్యాన్ని ప్రశంసించారన్నారు. ఈ కార్యక్రమంలో కర్మాగారం సీనియర్ డీజీఎం శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం మరమ్మతులకు ప్రతిపాదనలు

సాక్షి ఎఫెక్ట్..

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి ఎంపీడీవో కార్యాలయం మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని రాంబిల్లి ఎంపీడీవో ఎస్.జయమాధిరి బుధవారం తెలిపారు. ఇటీవల సాక్షి దిన పత్రికలో 'దినదిన గండం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. భవన పిల్లర్లు, శ్లాబు, సన్‌షేడ్, గదుల్లో శ్లాబ్ పెచ్చులు ఊడి రాలడం, ఫ్యాన్లు, లైట్లు పని చేయకపోవడం, వైరింగ్ పాడైపోవడం వాస్తవమేనని ఎంపీడీవో తెలిపారు. సిబ్బందిని వేరొక భవనంలోకి మార్పు చేసి, పాత భవనానికి మరమ్మతులు చేపట్టాలని జిల్లా ప్రజా పరిషత్ అధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు ఎంపీడీవో ఎస్.జయమాధిరి తెలిపారు.